క్లుప్తంగా

కాపు జేఏసీ కన్వీనర్‌గా శివనాగేశ్వరరావు



చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేటకు చెందిన మల్లెల శివనాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఏపీ కాపు, తెలగ,బలిజ ఉప కులాల జేఏసీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మా శ్రీనివాసనాయుడు నుంచి నియామక పత్రం అందుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

నరసరావుపేట: డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా శనివారం ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నరసరావుపేట డిపో కమిటీ ఆధ్వర్యంలో మూడోరోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జీటీ రావు మాట్లాడుతూ డిపోలో ఏడీసీలపై పని భారాన్ని పెంచి మానసికంగా ఇబ్బంది కలగ చేస్తున్నారని, అక్రమ చార్జిషీట్లు రద్దు చేయాలని, సీనియార్టీ ప్రకారంగా ఓడీలను ఏర్పాటు చేయాలని, సీనియార్టీ పక్కన పెట్టి వారికి ఇష్టానుసారంగా నచ్చిన వారికి డ్యూటీలు కేటాయించి సీనియర్ డ్రైవర్లను ఇబ్బంది పెట్టే విధానాన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు యాజమాన్యం కేటాయించిన మూడు రోజుల ప్రత్యేక సెలవు కాకుండా ఒక్కరోజు కూడా సెలవు మంజూరు చేయవద్దని యాజమాన్యం ఇబ్బంది పెట్టే వైఖరి విడనాడాలన్నారు. అదేవిధంగా పనిష్మెంట్లు లేకుండా చూడాలని, మెకానికల్ ఫెయిల్యూర్ వల్ల డ్రైవర్ సోదరులకు పనిష్మెంట్ ఇచ్చే విధానాన్ని తక్షణమే విడనాడాలని కోరారు. డిపో కార్యదర్శి జాని, రాష్ట్ర జిల్లా, జోన్ స్థాయి నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేయండి

నరసరావుపేట: ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులకు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శనివారం కోరారు.. ఇప్పటివరకు 12 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు.. 13వ బ్యాచ్ త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు 99592 25428, 73828 96038 సంప్రదించాలని కోరారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

చిలకలూరిపేటటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ చిలకలూరిపేట డిపో ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అరుణాచలేశ్వరుడి దర్శనం కోసం ప్రత్యేక బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు చెప్పారు. ఈ నెల 22 తేదీ రాత్రి 10 గంటలకు ప్రత్యేక బస్సు బయలదేరనున్నట్లు వివరించారు. టికెట్ రూ.2,500 ఉంటుందన్నారు. మరెన్ని వివరాలకు 7382895640కు సంప్రదించాలన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగు పాలెం రోడ్డులో గల చైతన్య నగర్ నందు వినుకొండ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో వితంతువులకు శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సీఈవో ఎండీ రాజు మాట్లాడుతూ సొసైటీ తరపున భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ట్రెజరర్ ఎం.రమేష్‌బాబు, సెక్రటరీ ఎం.ప్రవళిక, సభ్యులు ఎస్. బ్రహ్మయ్య, టి.వెంకటకృష్ణ, సీహెచ్. సమర్పణరావు, కృష్ణ పాల్గొన్నారు.

వేల్పూరులో రచ్చబండ కార్యక్రమం

- జగనన్న హయాంలోనే సుపరిపాలన
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నియోజకవర్గ అభివృద్ధి పై పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజలకు సుపరిపాలన నియోజకవర్గ అభివృద్ధితో పాటు అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ప్రాంగణంలో అన్నీ శాఖల అధికారుల ప్రజాప్రతినిధుల గ్రామస్తుల సమక్షంలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో గతంలో ఎన్నడు లేని విధంగా మంచినీటి సమస్యను పరిష్కరించామన్నారు. ఇంటి స్థలాల విషయంలో ప్రతిపక్షాలు ఆరోపణలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు.

బాబు ప్రజలకు చేసింది ఏముంది?

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమొత్తారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు కులమతాలకు పార్టీలకు అతీతంగా మంజూరు చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా వేల్పూరు గ్రామంలో రూ. 2 కోట్ల 80 లక్షల నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఇంటింటి నీటి కుళాయి పనులు చేపడతామన్నారు. గంటావారిపాలెం నుంచి వేల్పూరు వెళ్లే రహదారి మార్గంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.7.60 వేల నిధులు మంజూరైనట్లు చెప్పారు. అనంతరం నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి పనుల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు బొల్లా గిరిబాబు, సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల సెన్సీమ్, గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు, 30 వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- హసన్నాయునిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం హసన్నాయునిపాలెం, కోటప్పనగర్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావుతో కలసి గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను దగ్గర చేయడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. గ్రామసచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, తహసీల్దార్ కిరణ్ కుమార్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్

చిలకలూరిపేటటౌన్: ఈ నెల 24వ తేదీ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజని జన్మదినం జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్ చెప్పారు. శనివారం పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, బిత్రా రాజేంద్ర, మాజీ సొసైటీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు, పార్టీ నాయకులు షేక్ అల్లీమియా, కొచ్చెర్ల కిషోర్, సాపా సైదావలి, అంజిరెడ్డి, జిలాని, యూసుఫ్ ఖాజావలి పాల్గొన్నారు.

అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నారు

- గ్రంథాలయ సమస్యను పరిష్కరించండి
- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతి

నరసరావుపేట: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవరిస్తున్న ప్రైవేటు విద్యాలయాలపై చర్యలు తీసుకోవాలని, పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయం సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో రెండు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కోట సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు జీవో నెంబర్ 94.1సీ నిబంధనను ఉల్లంఘించి పాఠశాలలో పుస్తకాలు ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారన్నారు. అటువంటి పాఠశాలలపై కఠినమైన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. అలాగే గ్రంథాలయం సమస్యను ప్రస్తావిస్తూ 1953 నుంచి పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయం అద్దె భవనంలో నిర్వహించబడుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన 10 సెంట్లు స్థలం కేటాయింప చేశారన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌లో ఆర్టీసీ బస్టాండ్ వెనకాల పదిసెంట్లను మంజూరు చేస్తూ తీర్మానించారన్నారు. సదరు గ్రంథాలయం నిర్మించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ వారు కూడా ఒప్పుకున్నారని, దీనికి ఆర్టీసీ డిపో మేనేజర్ అభ్యంతరం తెలియజేస్తున్నారన్నారు. కావున సమస్యను పరిష్కరించి గ్రంథాలయం నిర్మించాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను త్వరలోనే పరిష్కరించి గ్రంథాలయ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ



రోగులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ హారిక, స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు

నరసరావుపేటరూరల్: మండలంలోని పెదరెడ్డిపాలెంలో ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్‌లు చేయించుకున్న రోగులకు శనివారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గత నెల 7వ తేదీన శంకర కంటి ఆసుపత్రి, స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి 120 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రిలో శుక్లాల ఆపరేషన్లు నిర్వహించారు. నెలరోజుల తరువాత శనివారం వీరికి కంటి పరీక్షలు జరిపి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హారిక, క్యాంప్ కోఆర్డినేటర్ సైదులు, స్నేహహస్తాలు ప్రతినిధులు పాల్గొన్నారు.

సొలస పాఠశాలలో సత్కార కార్యక్రమం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు గ్రామపెద్దలు శనివారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ముందుగా జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు విద్యాశాఖ నిర్వహించిన సాధారణ బదిలీ మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. వీరితోపాటు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురిని ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై గ్రామంలోని ఏఏ ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న షేక్ జున్ను మాస్టార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మద్దూరి విజయ బాలచంద్రా రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం.వీరారెడ్డి, హైస్కూల్ హెచ్ఎం ఈవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

మూడు ద్విచక్ర వాహనాలు చోరీ

చిలకలూరిపేటటౌన్: ద్విచక్రవాహనాలు చోరీకి గురైన సంఘటన శనివారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన కొర్రపాటి జోషిబాబు, తన మిత్రులతో మూడు ద్విచక్రవాహనాలపై పట్టణానికి తాగునీరు అందించే చెరువు సమీపంలో ఉన్న వెంచర్‌ను చూడటానికి వచ్చాడు. ఈ క్రమంలో వాహనాలను కాల్వ పక్కన పార్కు చేసి లోపలికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వచ్చి చూసేసరికి వాహనాలు చోరీకి గురైనట్లు గ్రహించారు. శనివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని గేదె మృతి

వినుకొండ(నూజెండ్ల): ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో చూడి గేదె మృతి చెందిన సంఘటన నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో శనివారం జరిగింది. సేకరించిన వివరాలప్రకారం గ్రామానికి చెందిన పగడాల లక్ష్మీనారాయణకు చెందిన గేదె రోడ్డు దాటుతుండగా బెంగుళూరు నుంచి వినుకొండ వస్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో గేదె అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో బాధితుడు ఐనవోలు స్టేషనులో ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బొల్లాపల్లికి ప్రథమ స్థానం

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో బొల్లాపల్లి మండలం జిల్లాలోని మొదటి స్థానంలో ఉందని ఏపీవో ఎస్.ఆంజనేయరాజు తెలిపారు. 2023 సంవత్సరంలో ఇప్పటి వరకు 30,8356 పనిదినాలు పూర్తి చేసి జిల్లాలో ముందంజలో ఉన్నామన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల పరిశీలన

చిలకలూరిపేటటౌన్: నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు సమీపంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, అండర్ గ్రౌండ్ కెనాల్ పనులను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని శనివారం పరిశీలించారు. ముందుగా తాగునీటి చెరువులో నీటి నిల్వలను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుకు సాగర్ జలాలు జులై చివరి వారంలోని, ఆగస్టు మొదటి వారంలో గాని విడదలయ్యే అవకాశం ఉందని తెలిపారు.

సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేయాలి

శావల్యాపురం: సెల్‌ఫోన్లు పోయిన వారం దరూ తగిన ఆధారాలతో పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ వెల్లడించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషను సీఐ సందర్శించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సెల్‌ఫోన్లు పోయిన బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు మాస్టర్‌మైండ్స్ పురస్కారాలు

నరసరావుపేట ఈస్ట్: సీనియర్ ఇంటర్మీడియెట్-2023 పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందచేస్తున్నట్టు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్లుపల్లి మోహన్ శనివారం తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో నేటి సాయంత్రం 5గంటలకు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతి అందచేస్తామని వివరించారు. విద్యార్థులు తమ గుర్తింపు కార్డు (ఆధార్, కళాశాల ఐడీ కార్డ్), సీనియర్ ఇంటర్మీడియేట్ పరీక్షలో సాధించిన మార్కుల జాబిత (ఇంటర్నెట్ కాపీ) వెంట తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 8978180847, 93476 26288 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జగనన్న పథకాలు విద్యార్థి ప్రగతి కోసమే



కంభంపాలెం సచివాలయంలో విద్యాకానుక పొందిన విద్యార్థులతో నాయకులు, ఉద్యోగులు



యడ్లపాడులో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పి.రుహాన్సీ, హెచ్ఎం ప్రసన్నకుమార్

- ఎంపీపీ పిడతల రుహాన్సీ
- జేవీకే కిట్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీపీ

యడ్లపాడు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అందించే విద్యా పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ పిడతల రుహాన్సీ చెప్పారు. మండల కేంద్రంలోని ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎంపీపీ రుహాన్సీ చేతుల మీదుగా జగనన్న విద్య కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలే ఎక్కువగా అభ్యసిస్తారన్నారు. వారందరికీ విద్య అనే ఆస్తిని కార్పొరేట్ సౌకర్యాలతో ఉచితంగా అందిస్తోందని తెలిపారు. మనబడి నాడు-నేడుతో సర్కారు స్కూళ్ల రూపురేఖల్ని మార్చిన ఘనత జగనన్నదే అన్నారు. పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫాం, టై, బూట్లు, బ్యాగులు, మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మంచి పోషకాహారం, నిపుణులైన గురువులచే నాణ్యమైన విద్య, ఇంగ్లిష్ మీడియంలో అందిస్తుందన్నారు. ఆయా పథకాలను గ్రామీణ ప్రాంత విద్యార్థులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జేవీకే కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎం చైర్మన్ కె.నాగరాజు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎం.ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు బి. రాజకుమారి, జి.గౌరమ్మ, వి.పద్మజ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు అందజేత



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ

నరసరావుపేట: స్థానిక 14వ వార్డు కంభంపాలెం సచివాలయంలో శనివారం విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికీ విద్యాకానుక అందిస్తున్నారని వార్డు నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో విద్య కోసం అందిస్తున్న ఈపథకం పేద విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వార్డు కన్వీనర్, ఇన్‌చార్జి బండి వెంకటేశ్వర రెడ్డి, కన్వీనర్ పాతర్ల చిన్ని, బాపూజీ స్కూల్ హెడ్ మాస్టారు నాగయ్య, సచివాలయ అడ్మిన్ సెక్రటరీ షేక్ కరీముల్లా, సచి వాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంభంపాడులో....

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగించుకొని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం టి. రవికుమార్, పీఎంసీ చైర్మన్ ఎన్.సతీష్, ఎంపీటీసీ రాజేష్, గ్రామపెద్దలు లింగారావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆర్‌జే రమేష్, సూర్యప్రకాష్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



మాట్లాడుతున్న షేక్ రఫాని



రొంపిచర్లలో ప్రశంసా పత్రాలతో ఆణిముత్యాలు

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరిందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విద్యారంగంలో ప్రభుత్వ తీసుకొచ్చిన సంస్కరణలపై వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఫాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక, అంతకు ముందు పరిస్థితులను ఉపాధ్యాయులు బేరీజు వేయాలని చెప్పారు. నాడు-నేడు పథకం ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దిందని వెల్లడించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు మరుగు దొడ్లు సైతం లేక ఇబ్బందులు పడే వారని గుర్తు చేశారు. అలాంటిది నేడు మినరల్ వాటర్ నుంచి మరుగుదొడ్ల వరకు అన్ని వసతులను ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. దీనికి తోడు అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆణిముత్యాలు వంటి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో విద్యార్థులతో పాఠశాలలు కళకళలాడుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సత్ఫలితాల కారణంగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు లేవు అని బోర్డులు పెట్టే పరిస్థితి కలిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, తోట రామచంద్రప్రసాద్, షేక్ అల్లీమియా, తాళ్ల అంజిరెడ్డి, బేరింగ్ మౌలాలి, బండ్ల శ్రీనివాసరావు, తోట బ్రహ్మస్వాములు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం గత విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు క్రింద నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.యం. సుభానీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో చదివి విద్యార్థులకు 550 పైగా మార్కులు రావటం అభినందనీయమన్నారు. అనంతరం పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన రెబ్బా శ్రీనిధి సుష్మ, ద్వితీయ స్థానం సాధించిన పిడెం ప్రత్యూష, తృతీయ స్థానం సాధించిన గుంజి స్రవంతిలకు జగనన్న ఆణిముత్యాలు క్రింద నగదు ప్రోత్సాహక బహుమతులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్: జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియన్స్ అవార్డు-2023 పొందిన విద్యార్థిని నూతికట్టు వెంకట సాయి సంజనా కుమారిని వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సంజనాకు అభినందన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యనభ్యసించి, ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 570 మార్కులు సాధించి, పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచి, విద్యార్థిని సంజనా పాఠశాలకు వన్నె తీసుకువచ్చిందన్నారు. ఇటీవల (ఏడాదిన్నర క్రితం) తల్లి మరణించినప్పటికీ, మనోధైర్యాన్ని కోల్పోకుండా ప్రతిభ కనబరిచి, సంజనా తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో భాగంగా సంజనాను ప్రశంసా పత్రం, నగదు బహుమతి, మెడల్‌తో సన్మానించారు.